## ముఖ్యమంత్రి రాకతో

# నారావారిపల్లి కళకళ

### సంక్రాంతి సంబరాలకు నారావారిపల్లి ముస్తాబు
### నేడు విస్తృత స్థాయిలో చంద్రబాబు ప్రారంభోత్సవాలు





చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాకతో నారావారిపల్లి సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నది. హిందూ సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణ, కొనసాగింపులో భాగంగా నారా భువనేశ్వరీ, నారా బ్రాహ్మిణీ, నారా దేవాన్ష్, నందమూరి వసుంధర, వసుంధర కుమార్తె, అల్లుడు, నందమూరి రామకృష్ణ, తదితరులు సోమవారం నారావారిపల్లికి చేరుకున్నారు. అదేవిధంగా సాయంత్రం 5-6 గంటల మధ్యన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏ.రంగంపేట సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి వాజ్‌పాయ్, ఎస్పీ సుబరాయుడు, ఎంఎల్‌ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, సిఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎంఎల్‌ఏలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, కె.రామకృష్ణ, ఆదిమూలం, పాశం సునీల్, అమర్‌నాద్ రెడ్డి, మురళీమోహన్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, శాప్ ఛైర్మన్ ఏ.రవి నాయుడు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చూడ ఛైర్మన్ హేమలత, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఏఎస్పీ రవిమనోహర్ చారి, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, డిపిఓ డి.సుశీలాదేవి, తదితరులు ముఖ్యమంత్రికి, విద్యాశాఖ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కారులో తండ్రి తనయుడు నారావారిపల్లిలోని తమ నివాసానికి కారులో వెళ్ళారు. తమ నివాసం వద్ద ముఖ్యమంత్రి కోసం ఎదురు చూస్తున్న ప్రజల నుండి వినతులను ముఖ్యమంత్రి స్వయంగా తీసుకుని వారి బాధలు తెలుసుకున్నారు.




## సిఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వాగతం

సంక్రాంతి పండుగకు స్వగ్రామం నారావారిపల్లెకు విచ్చేసిన సిఎం నారాచంద్రబాబునాయుడుకు సోమవారం సాయంత్రం సాదర స్వాగతం లభించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పుష్పగుచ్ఛంతో స్వాగతంపలికారు.

ప్రభాతవార్త-తిరుపతి



# పిఎస్ఎల్‌వి-సి62 ప్రయోగం విఫలం



రాకెట్ ఎగురుతున్న దృశ్యం

సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త
ఇస్రో విజయాల పరంపరకు బ్రేక్ పడింది. నూతన సంవత్సర ప్రారంభంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విఫలమై ఇస్రోలో నిరాశ నింపింది. సోమవారం ఉదయం 10 గంటల 18 నిమిషాలకు శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి కౌంట్‌డౌన్ పూర్తి కాగానే పిఎస్ఎల్‌వి-సి62 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగికి ఎగిసింది. 18 నిమిషాల ప్రయోగ గమనం జరగాల్సి ఉండగా, 8 నిమిషాల 41 సెకన్లు మాత్రమే పయనించిన రాకెట్ గ్రౌండ్ స్టేషన్‌తో లింక్ తెగిపోయింది. మొదటి దశ, రెండో దశ, మూడవ దశలు పూర్తయిన తర్వాత నాలుగవ దశలో రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపేందుకు మొరాయించింది.నాలుగో దశలో రాకెట్ గమనం గతి తప్పి ఇగ్నిషియం నిలిచిపోవడమే కాకుండా కక్ష్యలోకి వెళ్లకుండా పల్టీలు కొట్టింది. మూడో దశల గమనం విజయంపై మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, డైరెక్టర్లు అప్పటి వరకు చప్పట్లు, హర్షధ్వానాలు చేశారు. నాలుగో దశలో రాకెట్ గమనాన్ని చూసి ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. ఛైర్మన్ వి.నారాయణన్, డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్‌లు, శాస్త్రవేత్తల బృందం ఏమి జరిగిందో అర్థంకాక ఒకింత ఆందోళనకు గురయ్యారు.

### నాలుగో దశలో సాంకేతిక లోపం
### విఫల ప్రయోగంపై విశ్లేషిస్తున్నాం : ఇస్రో ఛైర్మన్

#### విఫల ప్రయోగంపై విశ్లేషిస్తున్నాం



పిఎస్ఎల్‌వి-సి62 రాకెట్ విఫల ప్రయోగంపై పూర్తిస్థాయిలో విశ్లేషిస్తున్నామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. పిఎస్ఎల్‌వి-సి62 ప్రయోగం విఫలమైన అనంతరం ఆయన మీడియా సెంటర్‌కు వచ్చి మాట్లాడుతూ ప్రస్తుతం మూడో దశలు సాఫీగానే జరిగినప్పటికీ నాలుగో దశలో అవరోధాలు ఏర్పడటంతో గ్రౌండ్ స్టేషన్‌తో రాకెట్ సంబంధాలు తెగిపోయాయన్నారు. దీంతో భూభాగంలోని వివిధ కంట్రోల్ సెంటర్ల నుంచి సమాచారం తెప్పించుకుని ప్రయోగం విఫలమైన కారణాలపై విశ్లేషిస్తున్నామని చెప్పారు.



మూడో దశ




గతి తప్పిన దృశ్యం

### పిఎస్ఎల్‌వి సిరీస్‌లో నాలుగు ప్రయోగాలు విఫలం

పిఎస్ఎల్‌వి రాకెట్ సిరీస్‌లో ఇప్పటివరకు 64 ప్రయోగాలు జరగ్గా నాలుగు విఫలమయ్యాయి. ఒక ప్రయోగం పాక్షికంగా విఫలమైంది. మొదటి ప్రయోగం 1993 సెప్టెంబర్ 20న జరగ్గా ఆ ప్రయోగంలో రాకెట్ ఆన్‌బోర్డ్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన లోపంతో రెండు, మూడు దశల వేరయ్యే సమయంలో సమస్య మొదలైంది. దీంతో ఈ రాకెట్ సముద్రంలో కూలిపోయింది. కక్ష్యకు చేరాల్సి న ఐఆర్ఎస్1ఇ ఉపగ్రహం గమ్యం చేరలేదు. పిఎస్ఎల్‌వి-సి39 రాకెట్ ప్రయోగం 2017వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీన జరిగింది. రాకెట్ అగ్రభాగంలో హీట్ షీల్డ్ విడిపోకపోవడంతో సమస్య ఏర్పడింది. దీంతో ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ నావిగేషన్ శాటిలైట్ హీట్‌షీల్డ్ లోపల చిక్కుకుపోయి నిరుపయోగమైంది. అలాగే పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ 2025 మే 18న ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. ఈ రాకెట్ ప్రయోగంలో పీడనం తగ్గడం వలన మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో భూపరిశీలన పరిశీలన ఉపగ్రహం ఇఓఎస్-09ను కక్ష్యలోకి చేర్చలేకపోయింది. అలాగే పిఎస్ఎల్‌వి-సి1 1997 సెప్టెంబర్‌లో నిర్వహించగా ప్రయోగం పాక్షికంగా విఫలమైంది. నాలుగో దశలో ఇంధన ప్రవాహం తగ్గడంతో ఇంజన్ అనుకున్న సమయాని కంటే ముందుగా ఆగిపోయింది. అనంతరం ఉపగ్రహంలోని కొంత ఇంధనాన్ని ఉపయోగించి సరైన కక్ష్యలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టగలిగారు. ప్రస్తుతం పిఎస్ఎల్‌వి-సి62 ప్రయోగం నాలుగో దశలో సాంకేతిక లోపంతో అనుకున్న లక్ష్యానికి చేరలేకపోయింది. దీంతో ఇఓఎస్-ఎన్1 అన్వేష్ శాటిలైట్‌తో పాటు మరో 15 మైక్రో శాటిలైట్లు సూర్యావర్తన కక్ష్యలోకి చేరలేకపోయాయి. కాగా, పిఎస్ఎల్‌వి సిరీస్‌లో 64 ప్రయోగాలు జరగగా, ఇందులో నాలుగు ప్రయోగం మాత్రం విఫలమయ్యాయి. మిగతా 60 ప్రయోగాలు విజయవంతం కావడం శాస్త్రవేత్తలకు కొంత ఊరటనిస్తుంది.

# అదరహో అదరహా

### మూడురోజులు పులికాట్ తీరంలో సందడే సందడి



పులికాట్‌లో ఫ్లెమింగో పక్షులు

సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త
సూళ్లూరుపేట కేంద్రంగా పులికాట్, నేలపట్టు, బివిపాలెం పర్యాటక ప్రాంతాల విశిష్టతను చాటుతూ పులికాట్ తీరంలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ 2026 అదరహో అనే రీతిలో జరిగింది. ఒకపక్క సందర్శకుల తాకిడి మరోపక్క సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పోటీలు పండుగకు నిండుతనం తీసుకొచ్చాయి. నేలపట్టు, అటకానితిప్ప, బివిపాలెం ప్రాంతాల్లో పక్షుల విన్యాసాలు తిలకించేందుకు సందర్శకులు పోటెత్తారు. దీనికితోడు ఉచిత బస్సులు ఏర్పాటు, సొంత వాహనాల్లో సందర్శకులు ఈ ప్రాంతాలకు తరలివచ్చారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ప్రత్యేకంగా హెలికాప్టర్ రైడ్‌ను ఏర్పాటు చేశారు. శ్రీసిటీ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ డ్రైవ్ బయలుదేరి పులికాట్, నేలపట్టు, బివిపాలెం చుట్టూ తిరుగుతూ విహంగ వీక్షణ కల్పించే ఏర్పాటు చేశారు. శనివారం ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, విజయశ్రీల చేతులు మీదుగా శోభాయాత్రతో ప్రారంభమైన పండుగ వర్షం అడ్డంకి, అధికారుల సమన్వయ లోపాలను అధిగమించి సందర్శకులు తరలి రావడంతో విజయవంతమైంది. సినీ తారలు ఆషికారంగనాథ్, హెబ్బా పటేల్, హయత్ డియోల్, హైపర్ ఆది, రాకెట్ రాజేష్, చలాకి చంటి, శివారెడ్డిల స్కిట్లు, మిమిక్రీలు అలరించాయి. సమీర భరద్వాజ్, సాకేత్‌ల పాటలు ఉర్రూతలూగించాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సారథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అంతా తామై ఈ పండుగ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ప్రణాళికాబద్ధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పండుగ సాఫీగా జరిగిపోయింది. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముగింపు ఉత్సవానికి సోమవారం రాత్రి హాజరై పండుగకు నిండుతనం తీసుకొచ్చారు. పండుగకు మంత్రులు, విఐపిలు రాలేదన్న వాదనలకు చెక్ పెడుతూ మంత్రి దుర్గేష్ రావడం ప్లస్ పాయింట్‌గా మారింది. దీనికితోడుగా మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్‌లు పండుగ విజయానికి తమవంతు సహకారాన్ని అందజేశారు.

## సిఎం సొంత జిల్లాలో పనిచేయడం సంతోషం

### జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి
### నూతన సంయుక్తకలెక్టర్, తుడ విసి గోవిందరావు



తిరుపతి,జనవరి 12ప్రభాతవార్త:
విజన్‌తో పనిచేసే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సొంత జిల్లాలో పనిచేసే అవకాశం కలగడం సంతోషమని తిరుపతి జిల్లా నూతన సంయుక్తకలెక్టర్, తుడ విసిగా నియమితులైన ఆర్.గోవింద రావు తెలిపారు. తిరుపతిజిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని,పై అధికారుల ఆలోచనలకు అనుగుణంగా, సూచనలమేరకు పనితీరు సాగిస్తానన్నారు. సోమవారం జరిగిన పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీల్లో జిల్లా సంయుక్తకలెక్టర్,తుడ విసిగా ఆర్.గోవిందరావు నియమితులయ్యారు. ఈయన 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. రాష్ట్ర సివిల్‌సప్లయిస్ శాఖ డైరెక్టర్‌గా, వినియోగదారుల వ్యవహారాలు శాఖ కార్యదర్శిగా, సర్వే,భూములకు సంబంధించిన విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. సివిల్ సప్లయిస్‌శాఖ డైరెక్టర్ బాధ్యతల నుండి తిరుపతి జిల్లాకు సంయుక్తకలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఏ శాఖలో ఉన్నా తనదైన శైలిలో పాలనసాగించేవారని మంచి పేరు ఉంది. ఈ నేపథ్యంలోనే గోవిందరావును సిఎం తన సొంత జిల్లాకు నియమించుకున్నారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదివరకు తుడ విసిగా, ఇన్‌ఛార్జి జెసిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎన్.మౌర్య తిరుపతి నగరపాలక కమిషనర్‌గానే కొనసాగుతారు.



సోమవారం ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రభాతవార్త - చిత్తూరు

## రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్దపీట : మంత్రి కందుల దుర్గేష్

సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త
రాష్ట్రంలో పర్యాటకరంగం అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని, దానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం సూళ్లూరుపేటలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్-2026 ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన వేదిక అయిన జూనియర్ కాలేజి గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పులికాట్, నేలపట్టు, భీమునివారిపాలెంతో పాటు ఇతర పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, వీటిని భవిష్యత్‌లో మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో తాను పాల్గొన్నానని, అప్పట్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రస్తుతం



ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 7 మెగా ఫెస్టివల్స్‌లో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను చేర్చడం జరిగిందని, దీంతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి పరుగులు తీస్తుందని చెప్పారు. అటు పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, దీంతో సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల్లో సూళ్లూరుపేట కూడా ఉండటం ఎంతో కలిసి వచ్చిన అంశంగా ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక అభివృద్ధికి, పర్యాటకరంగ అభివృద్ధి తోడైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలేజి మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఎజి కిషోర్, ఆదినారాయణరెడ్డి, బొమ్మన పళణి, నాయుడుపేట ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి, అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ, టూరిజం ఆర్‌డి రమణప్రసాద్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, డిఎఫ్‌ఓ హారిక, ఆర్డీఓ కిరణ్మయి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.51 కోట్లు ఆదాయం



కాణిపాకం, జనవరి 12 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.51 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. 19 రోజులకు గాను హుండీల ద్వారా 1,51,15,630 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 25 గ్రాముల బంగారు, ఒక కిలో 200 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 9,178 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 1,39,869 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 709 అమెరికా డాలర్లు, 40 ఆస్ట్రేలియా డాలర్లు,32 మలేషియా రింగిట్స్, 55 సింగపూర్ డాలర్లు,35 కెనడా డాలర్లు, యూరో కరెన్సీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ,ఏఈఓలు రవీంద్రబాబు,ధనుంజయ, హరిమాధవరెడ్డి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

### ఓబులవారిపల్లె, పుల్లంపేట

# మండలాలకు మహర్దశ

#### కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం....





ఓబులవారిపల్లి, జనవరి 12 ప్రభాతవార్త
రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాలలో రహదారులకు మహర్దశ ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంచెలంచెలుగా అభివృద్ధి జరుగుతూ గ్రామీణ ప్రాంతాలలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అటు ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాల్లో డబుల్ రోడ్డు తారు రోడ్డు నిర్మాణం పనులు, లింకు రోడ్డు, మెటల్ రోడ్లు నిర్మాణం పనులు కోసం మూడు కోట్ల రూపాయలు నిధులతో రోడ్లకు మహర్దశ సంతరించుకుందనే చెప్పవచ్చు. ఏది ఏమైనా కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి రూపానంద రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తున్నామని కూటమి నాయకులు అంటున్నారు. చొప్పవారిపల్లి కొమ్మనవారిపల్లి మార్గమధ్యంలో చిట్వేలి పుల్లంపేట రోడ్డును కలుపుతూ రహదారి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఓబులవారిపల్లి మండలం. లింగిరెడ్డిపల్లి నుంచి పెద్దవరం పాడు వల్లూరు పల్లి పుల్లంపేట మండలంలోని కలుపుతూ రోడ్డు విస్తరణ కోసం కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామన్నారు ఈ యువ నాయకులు మొక్క సాయి వికాస్ రెడ్డి కార్యక్రమంలో కూటమి నాయకులు చంద్రశేఖర్ నాయుడు శ్రీనివాసరాజు శివయ్య శివయ్య నాయుడు దేవరకొండ నరసింహులు కోటీశ్వర్ నాయుడు పుల్లగంటి చంద్ర గజేంద్ర నాయుడు రవీందర్ నాయుడు సుబ్బారెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యశాలకు భూమిపూజ



పుల్లంపేట, జనవరి 12 ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని మెయిన్ బజార్ దగ్గర ఆయుర్వేద వైద్యశాలకు సోమవారం ఆయుర్వేద వైద్య అధికారిణి డాక్టర్ భారతి వైద్యశాలకు భూమిపూజ చేశారు. కొన్నేళ్లుగా అనుమతులు లేక ఒక ప్రైవేట్ భవనంలో విధులు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యశాలకు ఎట్టికేలకు మోక్షం లభించింది. దీంతో మెయిన్ బజార్ లోని ఓ స్థలంలో భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు మలవతు సుబ్బరాయుడు రిటైర్డ్ హెడ్మాస్టర్ సామల సుబ్బరాయుడు ఆస్పత్రి సిబ్బంది సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం

- 16 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా కార్యాచరణ
- విద్యుత్ కొనుగోలు ధర యూనిట్‌కు రూ.1.19 తగ్గించడం లక్ష్యం
- ల్యాండ్ రికార్డుల ప్రక్షాళణ ఈ ఏడాదిలో పూర్తి : ముఖ్యమంత్రి చంద్రబాబు



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్ది అభివృద్ధిలో అగ్రస్థానం నిలపడానికి నిరంతరం కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం సిఎం నారా చంద్రబాబునాయుడు మంత్రులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నుండి ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే వివిధ పథకాలకు మంజూరు చేసిన నిధులను ఈ నెలాఖరులోపు వినియోగించుకోవాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం నారా చంద్రబాబునాయుడు జీఎస్డీపి, 10 సూత్రాలు, కేంద్ర పథకాల అమలు, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కింద పెట్టుబడుల ప్రతిపాదనలు, ఆర్టీజిఎస్, తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పాల్గొన్నారు.

## తెదేపాలో కష్టపడేవారికి తప్పక గుర్తింపు

– ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ – జిల్లా అధికార ప్రతినిధి సాంబశివంకు ఘన సన్మానం !!



**కుప్పం, జనవరి 12ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీలో కష్టపడేవారికి సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ తప్పక గుర్తింపు ఇస్తారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మల్లానూరులోని రవి మహల్‌లో తెదేపా జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీఎం పిపి పిసి సాంబశివం అభినందన సభనుఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగాడా॥ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యావేత్త అయిన సాంబశివం పార్టీకి ఎన్నోఏళ్లుగా సేవలు అందిస్తున్నారన్నారు. ఎంపిపి, జడ్పీటిసిగా మండల అభివృద్ధికి విశేషకృషి చేశారన్నారు. ఆయన ముమ్ముందు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎ ం ఉడా ఛైర్మన్‌డా॥బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యావంతుడు అయిన సాంబశివం మల్లానూరు ప్రాంతంలోనే కాక మండలంలో సైతం పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. అనంతరం జిల్లా అధికార ప్రతినిధి సాంబశివంను నాలుగుమండలాల నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలో కడ సభ్యుడు రామచంద్ర, సి ంగపూర్ రవి, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మున్సి పల్ ఛైర్మన్ సెల్వరాజ్, నేతలు విభూషణ్,మోహన్, ప్రకాష్, రాజా, మండల అధ్యక్షుడు రాజగోపాల్,పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, మున్సి పల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్పోరేషన్ డైరెక్టర్లు పార్థసారథి,చెక్కునత్తం మణి,రుద్రప్ప, బాబు,హేమాంబర గౌడు, నేతలు డా॥ వెంకటేష్, కన్నన్, సత్యేంద్రశేఖర్,ఆర్ముగ ం, అనసూయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నడిమూరు పంచాయతీ బోడగుట్టపల్లి, వీర్నాగపురంలో నిర్వహించిన పల్లెప ండగ 2.0కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బోడగుట్టపల్లిలో నూతన పైపులైను, నూతన మంచినీటి బోరు, నూతన వీధి దీపాలతో పాటు సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. వీర్నాగపురంలో నూతన బోరు, పైపులైను, అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించి ప్రస ంగించారు. గత ప్రభుత్వ పాలనలో రోడ్లపై గు ంతలకు తట్ట మట్టివేసే వారు కరువయ్యారన్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు ఆ తర్వాత అనే రీతిలో సిఎం చంద్రబాబు వేల కోట్ల రూపాయలతో కుప్పాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. 2203కోట్లతో ఏడు పరిశ్రమలకుశ ంకుస్థాపన చేశారని తద్వారా 20-25వేల ఉద్యోగాలు స్థానికులకు లభిస్తాయన్నారు.అనంతరం బేటరాయస్వామి టూ రిజం పార్కును పరిశీలించారు. టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, టిటిడిడైరెక్టర్ వైద్యం శాంతారాం, సర్పంచ్ జెకె సంతోష్, కార్పోరేషన్‌డైరెక్టర్ మణి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు,క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, కో క్లస్టర్ వేడి,మాజీ సర్పంచ్ వల్లెప్ప, ఎపిఒ హరినాథ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## గ్రామాలకు చెత్తసేకరణ సైకిళ్లు.. టబ్బులు పంపిణీ

శాంతిపురం, జనవరి 12 ప్రభాతవార్త



మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ సైకిళ్లు, టబ్బులను ప్రభుత్వం తరపున పంపిణీ చేశారు. పంచాయతీ కార్య దర్శి రవినాయక్ నేతృత్వంలో చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలను శుభ్రంగా ఉంచాలనే ఆశయంతో సైకిళ్లతో పాటు తడి, పొడి చెత్త సేకరణకు ఆరు టబ్బుల వంతున అందించడం జరుగుతోందన్నారు.

## రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు - ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



**గుడుపల్లె, జనవరి 12 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో రైతులకు ఎక్కడా యూరియా కొరత రాకుండా చర్యలు చేపట్టినట్లు ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. సోమవారం కనమనపల్లి ఆర్ఎస్‌కె కేంద్రంలో రైతులకు రెండు వందల బస్తాల యూరియాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు గాను రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా అధికారులతో మాట్లాడామన్నారు. రైతులు కూడా పంటలకువిపరీతంగా ఎరువుల వాడకం తగ్గించి సే ంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలిండియా ఇంటర్ వర్సిటీ టోర్నీకి ద్రవిడ జట్టు

కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త



తమిళనాడులోని తిరుచినాపల్లిలో ఈనెల 14-17 తేదీల్లో జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ బాల్ బాడ్మింటన్ టోర్నీకి ద్రవిడ విశ్వవిద్యాలయం బాల్ బాడ్మింటన్ జట్టు హాజరు కానుంది. ఈ టోర్నీ తిరుచి రాపల్లి భారతీదాసన్ యూనివర్సిటీ అధ్వర్యంలో జమాల్ మహ్మద్ కాలేజ్‌లో జరుగుతుంది. ఈసందర్భంగా వైస్ చాన్స లర్ ఆచార్య ఎం. దొరస్వామి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించి వర్సిటీకి మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మాధవనాయుడు, పిటిఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## అడవి పందులతో బొప్పాయి రైతులకు తీవ్ర నష్టం.

**చిట్వేలి,జనవరి 12, ప్రభాతవార్త:** స్థానిక మండల పరిధిలోని కే కందులవారిపల్లి గ్రామంలో 8 ఎకరాల పొలంలో సాగుచేసిన బొప్పాయి మొలకలను అడవి పందులు ఆదివారం రాత్రి దున్ని చదును చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వాపోయారు. సదరు గ్రామ రైతులు కందుల శంకరయ్య, కందుల ఈశ్వరయ్య, కందుల మురళి, కందుల లక్ష్మమ్మ, కందుల రెడ్డమ్మ లకు చెందిన 8 ఎకరాల పొలంలో 7 వేలు బొప్పాయి మొలకలను సాగు చేశామన్నారు. ఒక్కొక్క మొక్క విలువ 32 రూపాయల తో కొనుగోలు చేశామని, పొలం దుక్కి, కూలీలకు, డ్రిప్పు పరికరాలు తదితర ఖర్చులకు సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సదరు రైతులు మొరపెట్టుకున్నారు. సోమవారం గ్రామ రెవెన్యూ అధికారి బాలసుబ్రమణ్యం, సచివాల య ఉద్యాన శాఖ సహాయకురాలు శివాత్మిక, అటవీ శాఖ తరఫున శ్రీనివాసులు నష్టాన్ని పరిశీలించారు.

## మహిళను కత్తితో బెదిరించి బంగారు నగదు తస్కరణ

పుత్తూరు రూరల్, జనవరి 12 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామం రహదారిపై సోమవారం సాయంత్రం ఓ మహిళ మెడలోని సరుదును హెల్మెట్ ధరించిన వ్యక్తులు కత్తితో బెదిరించి లాక్కెళ్లిన ఘటన చోటు చేసుకుంది. హెల్మెట్ ధరించిన ఇద్దరు దుండగులు స్కూటీపై వెళుతున్న మహిళను కత్తితో బెదిరించి, మెడలోని నాలుగు లక్షల విలువైన బంగారు సరదును లాక్కుని వెళ్లారు. బాధితురాలు కథనం మేరకు... స్థానిక కేకేసీ నర్సింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఉమామహేశ్వరి, విధులు ముగించుకుని పళ్లిపట్టుకి స్కూటీలో ఇంటికి వెళుతుండగా ఈ దోపిడీ జరిగిందని ఆమె తెలిపారు. దీంతో పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.

# రైల్వే కోడూరు డివిజన్

## విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించండి : ఎస్.ఇ

**పెనగలూరు, జనవరి 12 ప్రభాతవార్త**

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం ప్రజలు సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాల ఎగురవేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్.ఇ సోమశేకర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు గాలిపటాలు ఎగురవేయడం మామూలేనని పేర్కొన్నారు. పండు గను ఆనందంగా జరుపుకుంటూనే, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా కింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్‌పీడీసీఎల్ ఎస్.ఇ తెలిపారు. గాలిపటాలను ఎప్పుడూ విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు మరియు సబ్‌స్టేషన్లకు దూరంగా ఉన్న బహిరంగ ప్రదేశాలలో మాత్రమే ఎగురవే యాలి.గాలిపటాల దారాలు విద్యుత్ తీగలకు తగిలితే ప్రాణాపాయమైన విద్యుద్ఘాతం సంభవించే ప్రమాదం ఉంది.ప్లాస్టిక్, నైలాన్ లేదా లోహపు పూత ( మెటాలిక్ కోటింగ్) ఉన్న మంజా లేదా ఖైనీస్ దారాలుఖి విద్యుత్‌ను అత్యంత సులభంగా ప్రసరింపజేస్తాయి. ఇలాంటి దారాలు పొరపాటున విద్యుత్ లైన్లను తాకినప్పుడు, గాలిపటం ఎగురవేస్తున్న వారికే కాకుండా, చుట్టుపక్కల ఉన్నవారికి కూడా షాక్ తగిలే ప్రమాదం అధికంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ ఉన్న తీగలను తాకేందుకు ప్రయత్నించవద్దు. ఇది అత్యంత ప్రమాదకరం. వెంటనే విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కి కాల్ చేయండి లేదా మీ సమీపంలోని సెక్షన్ కార్యాలయానికి ఫిర్యాదు చేయండి, సిబ్బంది వచ్చి దానిని తొలగిస్తారని తెలిపారు.

## విద్యుత్ వైర్లు చోరీలు...

**ఓబులవారిపల్లి ప్రభాతవార్త జనవరి 12** రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లోనూ రోజురోజుకు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్లు చోరీలు పెరిగిపోతున్నాయి. వైర్లు చోరీ చేసేవారు అంతో ఇంతో నైపుణ్యం కలిగి ఉండాల్సి ఉంది అన్నీ తెలిసిన వ్యక్తులే ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి. అందులో ఉన్న . కాపర్ వైర్లను చోరీ చేస్తున్నట్లు సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఓబులవారిపల్లి మండలం శివ శంకరాపురం పంట పొలాలు గంగాలమ్మ దేవాలయం దక్షిణ భాగాన మూడు ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్లను చోరికి చేసినట్లు రైతులు వాపోయారు. మరి కొంతమంది రైతులు

## మంత్రిని కలసిన చిన్నా రాయల్



**పుంగనూరు జనవరి 12 ప్రభాతవార్త** రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సిరివేలు గంగాధర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలసి మంత్రితో నియోజకవర్గ పరిస్థితులపై వివరించారు.అలానే టూరిజం, సినిమా షూటింగులకు సంబంధించి పుంగనూరు పరిసర ప్రాంతాల్లో అనేక పురాతన కట్టడాలు మరియు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నట్టు వివరించారు.

## ఘనంగా వివేకానంద జయంతి

**పుంగనూరు జనవరి 12 ప్రభాతవార్త**




శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామీ వివేకానంద జయంతి వేడుకలను అఖిలభారత విద్యార్థి పరిషత్ ఏబీవీపీ సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టి మానవహారం ఏర్పాటు చేశారు.ఏబీవీపీ పట్టణ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ, భారతదేశ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి పరిచయం చేసిన మహా తత్వవేత్త స్వామీ వివేకానంద యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, క్రమశిక్షణను నూరిపోసిన ఆదర్శప్రాయుడనీ, వివేకానంద ఆలోచనలు యువతకు మార్గదర్శకమని అన్నారు. కార్యక్రమంలో సత్య రాజు, నగేష్, నిఖిల్, మల్లేష్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శిగా జివి రమణ



**చిత్తూరుహెల్త్, జనవరి 12 ప్రభాతవార్త:** రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శిగా మూడవసారి జివి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులో జనవరి 10, 11 తేదీల్లో యుటిఎఫ్ 51వ రాష్ట్ర యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో చిత్తూరు జిల్లా నుండి రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శిగా జివి రమణ 3వ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చిత్తూరు జిల్లా నుండి ఎన్.మణిగండన్, కె.రెడ్డప్పనాయుడు, కె.దీనావతిలు ఎన్నికయ్యారు. ఈ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు జిల్లా నుండి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.సదాశివరెడ్డి, సహాధ్యక్షులు డి.ఏకాంబరం, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం.సోమశేఖర్‌నాయుడు, కె.రఘుపతిరెడ్డి, ఎస్పీ భాషా, జిల్లా కార్యదర్శి కె.వంశీకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్



**చిత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ నియమితులయ్యారు. అలాగే ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. విద్యాధరిని ప్రభుత్వం విశాఖపట్నంకు బదిలీ చేసింది. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదర్శ్ రాజేంద్రన్‌ను ప్రభుత్వం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన రెండు రోజుల్లో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## చట్టసభల్లో అడుగు పెట్టడమే లక్ష్యంగా పోరాటాలు

– ఎపి నిర్భాష్ దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘ సమావేశం తీర్మానం



**చిత్తూరుహెల్త్, జనవరి 12 ప్రభాతవార్త:** చట్టసభల్లో అడుగు పెట్టడమే లక్ష్యంగా పోరాటాలు తీవ్రం చేయాలని ఎపి నిర్భాష్ దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘ సమావేశం తీర్మానించింది. చిత్తూరు ఉర్దూ షాదీమహల్‌లో సోమవారం ఎపి నిర్భాష్ దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘ ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షకీల్ అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు దూదేకుల కులస్తులు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం కల్పించలేదన్నారు. జనాభా దమాషా ప్రకారం దూదేకుల కులస్తులను రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని వాపోయారు. రాజకీయ పార్టీలు ఇప్పటికైనా దూదేకుల కుస్తులను గుర్తించాలని లేని పక్షంలో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షులు షఫీ సాహెబ్, కోశాధికారి అక్బర్‌తో పాటు పెద్ద ఎత్తున దూదేకుల కుస్తులు హాజరయ్యారు.

## పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 సమస్యలు



**చిత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త:** జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 30 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమానికి ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, డిటిసి డిఎస్పీ రాంబాబులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక లావాదేవీల విషయంపై 10 ఫిర్యాదులు అందగా భూ తగాదాలపై 8, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 3, ఆస్తి తగాదాలు 2, చిన్న తగాదాలు 2, చీటింగ్ 1, భర్త వేధింపులపై ఒక అర్జీ అందింది.

## నేటి నుండి యూరియా పంపిణీ

**యాదమరి, జనవరి 12 ప్రభాతవార్త:** యాదమరి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి రైతులకు యూరియా పంపిణీ చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి దీప ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకంతో హాజరై యూరియా పొందవచ్చునని ఆమె తెలిపారు.

## మల్లానూరులో దేశం శ్రేణుల భారీ ర్యాలీ



**కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త** మండలంలోని మల్లానూరు గ్రామంలో సోమవారం తెదేపా శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. మల్లానూరుకుచెందిన మాజీ ఎంపిపి పిసిసాంబశివం ఇటీవల జిల్లా తెదేపా అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలో ఆయనను పార్టీ శ్రేణులు ఊరేగింపుగా తీసుకువచ్చి ర్యాలీ చేపట్టారు. ప్రధాన రహదారిలో బాణసంచాను పెద్ద ఎత్తున కాల్చారు. ర్యాలీలో కేరళకు చెందిన కళాకారులు, డ్రమ్‌సెట్ బృందాల సంప్రదాయ నృత్యాలు, వాద్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మండలంనుంచే కాక నాలుగు మండలాలనుంచివచ్చిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీకి హాజరై సాంబశివంను అభినందనల్లో ముంచెత్తారు.కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎండుడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు, కడ సభ్యుడు రామచంద్ర, నేతలు విభూషణ్,మోహన్, ప్రకాష్, రాజా, మండల అధ్యక్షుడు రాజగోపాల్,నేతలు డా॥ వెంకటేష్, కన్నన్, సత్యేంద్రశేఖర్, ఆర్ముగ ం,స్వాతి, పద్మమ్మ,అనసూయ,గాయత్రి పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోండి: ఎస్ఐ

**పెనగలూరు, జనవరి 12 ప్రభాతవార్త** రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలలో ఉన్నటువంటి ప్రజలకు సంక్రాంతి పండుగను వైభవంగా మరియు శుభప్రదంగా జరుపుకోవాలని పెనగలూరు ఎస్.ఐ కె.రఘురామ్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడైనా కోడిపందాలు గానీ జూదాలుగాని ఆడిన వారిని పైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా జూదం గాని కోడిపందాలు గానీ జరిగిన ఎడల రహస్యంగా ఫోన్ చేసి తమకు తెలియజేస్తే వెనువెంటనే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## కుడా ఛైర్మన్‌ను కలిసిన మండలాధ్యక్షులు

**చిట్వేలి, జనవరి 12, ప్రభాతవార్త:**

రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జి, కూడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని సోమవారం ఆయన నివాసంలో చిట్వేలి మరియు పెనగలూరు టిడిపి అధ్యక్షులుగా ఎన్నికైన కాకర్ల నాగార్జున, ఎంజర్ల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. కూడా ఛైర్మన్ వారు ఇరువురికి శుభాకాంక్షలు తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధాంతాల కోసం మనమంతా కష్టపడి పని చేయాలని వారికి సూచించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, పార్టీ ఉపాధ్యక్షులు కొండా వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ బుంగటావుల రాజశేఖర్, కో క్లస్టర్ కట్టా గిరిబాబు ఇరు మండలాల నుంచి పలువురు కార్యకర్తలు కూడా ఛైర్మన్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఆరోగ్య విషయంలో మరో ముందడుగు

**రైల్వే కోడూరు, జనవరి 12 ప్రభాతవార్త** రైల్వే కోడూరు నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్య విషయంలో ప్రభుత్వం మరో ముందడుగు వేస్తున్నదని ప్రజల ఆరోగ్యం కోసమే నిరంతరం ప్రభుత్వం పనిచేస్తుందని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఆయుష్ ఆసుపత్రికి ముక్కారూపానందరెడ్డి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరులో ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తూ ఆయుష్ ఆసుపత్రిని కూడా నిర్మించేందుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వచ్చే నిరుపేదలకు చక్కటి వైద్యాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తున్నదని అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రమే కాకుండా ఎంతో మంది అనారోగ్య పీడితులకు ఆరోగ్య ప్రసాదుని ఏర్పాటు చేస్తున్నదని ఆయన అన్నారు. రైల్వే కోడూరు పట్టణంలో వైద్య సేవలు పట్ల సంబంధిత వైద్యులు చక్కటి వైద్యాన్ని అందిస్తున్నదని అన్నారు. కోడూరు ఆసుపత్రి ఆవరణంలో దాదాపు 30 లక్షల రూపాయలతో అత్యాధునిక ఆయుష్ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మనీ, మోలా, శివారెడ్డి తో పాటు తిప్పన రాజశేఖర్, జై చంద్ర, వైద్యులు బ్రహ్మకుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## స్వామివివేకానంద మెమొంటో, స్పోర్ట్స్‌కిట్ అందుకొన్న మునస్వామి



**చిత్తూరురూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** గత 40 సంవత్సరాలుగా సామాజికసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివిఎంసి సభ్యులు, జిల్లా సభ్యులు శ్రీరంగపల్లి మునస్వామి నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత చేతుల మీదుగా స్వామి వివేకానంద మెమొంటో,స్పోర్ట్స్‌కిట్ అందుకొన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ భవనంలో ఆదివారం మై భారత్ చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన స్వామి వివేకానంద 163 జయంతి ఉత్సవాల్లో అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో మైభారత్ జిల్లా గణాంకఅధికారి బాబురెడ్డి, సెట్విన్ సిఇవో, జిల్లా క్రీడాశాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేను సంవర్ధవంతంగా చేపట్టాలి



**చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త** మండల వ్యాప్తంగా జరుగుతున్న భూముల రీసర్వేను సంవర్ధవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ పార్వతి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి రికార్డులను నిసితంగా పరిశీలించారన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం రీసర్వేపై పంచాయతీల వారీగా సమీక్షించారు. విఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరస్వామికి సోమవారం పూజలు

–రోడ్డు, విద్యుత్ వసతిలేక భక్తుల ఇక్కట్లు



**చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త** చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి అగ్రహారం వద్దగల శ్రీవిశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భగా ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకులచే అభిషేక ప్రియునికి పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణదాత మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. కాగా దారి, విద్యుత్ సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## కోళ్ల పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు : సిఐ



**పూతలపట్టు, జనవరి 12 ప్రభాతవార్త** సంక్రాంతి సందర్భంగా కోళ్ల పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ గోపి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోళ్ల పందాలు పేకాట పూర్తి నిషేధిద్దాం అన్నారు. నిర్వహించే అనుమతి ప్రదేశాలలో డ్రోన్ కెమెరాలతో మా పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. భోగి మంటల సమయంలోను గాలిపటాలను ఎగరవేసే పెద్దలు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

## ఉపాధి హామీ పనుల్లో తప్పులు చేస్తే క్షమించం



**సోమల, జనవరి 12 (ప్రభాతవార్త)** ఉపాధి హామీ పనుల్లో తప్పులు చేస్తే ఎలాంటి వారినైనా క్షమించే ప్రసక్తే లేదని డ్వామా పిడి రవికుమార్ అన్నారు. సోమల ఉపాధి హామీ కార్యాలయం ఎదుట సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీ రవికుమార్ పలు పంచాయతీల్లో అక్రమాలకు పాల్పడిన క్షేత్ర సహాయకులు పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. 2004 నుంచి 2005 వరకు చేపట్టిన 9 కోట్ల రూపాయల వివిధ పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు. ఏపీ డి శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసాద్,పాల్గొన్నారు

## ఆశ్రమవాసులకు దుస్తులు పంపిణీ



**చిత్తూరురూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవాసమితి సభ్యులు సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని వివిధ ఆశ్రమంలో సేదతీరుతున్న పురుషులు, స్త్రీలకు పంచలు, చీరలను పంచిపెట్టారు. ఆదివారం డేనియల్ లెప్రసీ, సద్గురు ఆశ్రమంలో వున్న 10మంది స్త్రీలకు చీరలు, 5మంది పురుషులకు పంచలు, టవల్స్‌తో పాటు స్వామివారి వీభూది, ఫోటోలను అందజేసారు. ఈ సేవాకార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, బాలవికాస్ జిల్లా సమన్వయకర్త రెడ్డిమల్లు వసంత, జిల్లాసేవాదళ్ సమన్వయకర్త కొల్లు గజేంద్రరెడ్డి, సభ్యులు అమర్నాథరెడ్డి, పూర్వసమితి కన్వీనర్ శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్దేశ్వర స్వామి దేవస్థానానికి అన్నదాన సామాగ్రి వితరణ



**యర్రావారిపాలెం, జనవరి 12, ప్రభాతవార్త:** యర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయతీలోని తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి దేవస్థానానికి అన్నదాన సామాగ్రిని భక్తులు వితరణగా అందజేశారు. భక్తులు సిద్ధరామిరెడ్డి అన్న ప్రసాద కేంద్రానికి పులిగోను పల్లి సాయిబాబ గుడికి చెందిన వెంకట సిద్దులు రూ.12 వేలు, తిరుపతికి చెందిన శివకుమార్ రూ.4 వేలు విలువ చేసే అన్న ప్రసాద సామాగ్రిని అందజేశారు. అలాగే నెరబైలు కు చెందిన శివకుమార్ 2 గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరిగింది. భక్తులు అన్నదాన సామాగ్రి, సిలిండర్లను సిద్ధరామిరెడ్డి అన్నదాన కేంద్రం ఇంచార్జ్ సిద్దారెడ్డికు అందజేశారు.

## అంబుర్ రోడ్డు నిర్మాణానికి సీఎంకు వినతి

**రామకుప్పం, జనవరి 12 ప్రభాతవార్త** మండలంలోని 89 పెద్దూరు నుంచి అంబుర్ వరకు రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు నాయుడుకు మండల టిడిపి కార్యదర్శి కామరాజు నాయక్, రెస్కో డైరెక్టర్ మనోహర్ కోరారు. సోమవారం అమరావతిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా 89 పెద్దూరు గ్రామం నుంచి 15 కిలోమీటర్ల మేర అంబుర్ కు రోడ్డు నిర్మాణంతో తమిళనాడు, ఆంధ్రకు రాకపోకులతో ఆర్థిక అభివృద్ధి చెందుతుందన్నారు. రెస్కో డైరెక్టర్ మనోహర్ తనకు రెస్కోలో డైరెక్టర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి ,సంక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

## పి ఫోర్ ద్వారా ఆర్థిక సహాయం ..ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**రామకుప్పం,జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని కృష్ణరాజపురం గ్రామానికి చెందిన హరికృష్ణ కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏర్పాటుచేసిన పి ఫోర్ ద్వారా ఆర్థిక సాయంతో చిల్లర దుకాణం ఏర్పాటు చేశామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరికృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోవడంతో మెగా ఇంజనీరింగ్ సంస్థ దత్తత తీసుకున్న బంగారు కుటుంబాల్లో భాగంగా మూడు చక్రాల వాహనం, జీవనోపాధికి చిల్లర దుకాణం ఏర్పాటు చేశామన్నారు. దీంతో ఉపాధి కల్పనతో తమ కుటుంబం ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, సత్యేంద్ర శేఖర్, శ్రీరాముల రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, బాబు, భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పండగ సమయంలో నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు



**వెదురుకుప్పం, జనవరి 12 ప్రభాతవార్త :** పండగ సమయంలో నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ నవీన్ బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పండగను అడ్డుపెట్టుకుని కోడి పందాలు, జూదం,జల్లికట్టు తది తర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప రమైన చర్యలు తప్పవన్నారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని వాహనాలు నడుపరాదన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ గవాస్కర్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## అర్బన్ ఎస్ఐగా అన్సర్ బాషా

పుంగనూరు రూరల్, జనవరి 12 ప్రభాతవార్త

అర్బన్ ఎస్సైగా అన్సర్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పుంగనూరుకు వచ్చారు. అనంతరం పట్టణ సీఐ సుబ్బరాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రామచంద్రాపురం, జనవరి 12 ప్రభాతవార్త: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన విచారకర దుర్ఘటన సోమవారం బలిజపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. బలిజపల్లి గ్రామానికి చెందిన మునీశ్వరి (50) ఇంట్లో ఒంటరిగా నివశిస్తున్నది. తిరుపతిలోని రోబో హోటల్ నందు వంటమనిషిగా పనిచేసుకుంటూ గురువారం సాయంత్రానికి స్వగ్రామానికి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఒంటరిగా వున్న మహిళ హత్యకు గురైయ్యిందా, ఆత్మహత్యాకు పాల్పడిందా, అనారోగ్యంతో మృతి చెందినదా అనే విషయాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సివున్నది. సోమవారం మృతిరాలి ఇంటి నుండి దుర్వాసన రావడంతో గ్రామస్థులు ఆమె కుమారుడు కుప్పయ్యకు సమాచారం అందించారు. కుప్పయ్య తల్లి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామచంద్రాపురం ఎస్ఐ భక్తవత్సలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఇరకం దీవిని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తాం:మంత్రి




తడ, జనవరి 12 ప్రభాతవార్త: రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇరకం దీవిని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు ఫ్లెమింగో ఫెస్టివల్ పక్షుల పండుగ మూడవరోజు టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్ జిల్లా ట్రైనిక్ కలెక్టర్ సందీప్ రఘు వర్షిత్ మంత్రితో కలిసి బీవీ పాలెం పడవ రేవు వద్ద నుండి పడవ మార్గంలో ఇరకం దీనికి చేరుకున్నారు. ఇరకం దీవిని సందర్శించారు ఇరకం దీవిలోని ఆలయాలను దర్శించుకున్నారు. టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక అభివృద్ధి చేసేందుకు పెట్టుబడుదారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో మౌలిక వసతులు రోడ్లు అత్యవసర వైద్య చికిత్స వసతులు కల్పించాలని మంత్రి దృష్టికి గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసారథి ఏఎంసి ఉయ్యాల ప్రవీణ్, బొమ్మన్ పళని, సెల్వం, టీకే శ్రీనివాసన్, సుధాకర్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన పక్షులు పండుగ

**- నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ టూరిజం చైర్మన్**



దొరవారిసత్రం, జనవరి 12 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ కుటుంబ సమేతంగా సందర్శించి విదేశీ విహంగలను వీక్షించారు. అంతేకాకుండా శిథిల వ్యవస్థకు చేరిన టూరిజం సముదాయాన్ని వాటి స్థితిగతులను పరిశీలించారు. టూరిజం సముదాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి స్థాయిలో ప్రయోజనంలోకి వచ్చేలా చూస్తా మని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ఇక్కడి నిర్మాణాల పై నివేదిక కావాలని సంబంధిత టూరిజం అధికారులు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చట్టరీత్యా ఇంజనీరింగ్ శాఖ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా తడ బివిపాలెం మైపాడు బీచ్ వరదయ్యపాలెం దగ్గర వాటర్ ఫాల్స్ తదితర టూరిజం ప్రాంతాలను, సముదాయాలని ప్రయోజనం లోకి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**- ఘనంగా ముగిసిన ఫ్లెమింగో ఫెస్టివల్**

మూడు రోజులపాటు జరిగిన ఈ పండగకు సుమారు లక్షకు పైగా సందర్శకులు ఈ నేలపట్టు పక్షుల రక్షత కేంద్రాన్ని వచ్చారని, ఈ పక్షుల కేంద్రంలో అనేక రకాలైన విదేశీ పక్షులను వీక్షించారని. ఎవరికీ ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా పక్షులు పండుగను ఘనంగా ముగిసిందని ఫ్లెమింగో ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్నటువంటి తహసిల్దార్ శైలు కుమారి, ఎంపీడీవో గోవర్ధన్ మండల ఎస్సై కె.అజయ్ కుమార్ వారి అధికారులు విధులను చక్కగా నిర్వహించారని తెలిపారు.

## పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్‌కు ఘనస్వాగతం



సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో జరుగుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల్లో పాల్గొనేందుకు సోమవారం వచ్చిన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మాబాషా, ఆవుల రమణ, హరిబాబు, హేమంత్‌కుమార్ శర్మ, శంకు సురేష్, సూరి, హరి, సూర్యభాయ్, భాను, పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

## జోరుగా హుషారుగా పడవ ప్రయాణం

తడ, జనవరి 12 ప్రభాతవార్త: ఫ్లెమింగో ఫెస్టివల్ మూడవరోజు భీములవారిపాలెం పడవ రేవు వద్ద సందర్శకుల తాకిడి ఎక్కువైంది సెలవు రోజులు కావడంతో విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో పులికాట్ సరస్సులో సరదాగా పడవ ప్రయాణం చేశారు. ఇరకం దీవిని సందర్శించారు దీనిలో ఆలయాలను దర్శించుకున్నారు. విద్యార్థులకు ఉచితంగా బోటు ప్రయాణం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను ఎంతగానో ఆకర్షించింది. దానితోపాటు ముగ్గుల పోటీలు విద్యార్థులచే నాట్య ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం సమయానికి సందర్శకుల తాకిడితో బీవీ పాలెం పడవ రేవు పక్షుల పండగ వాతావరణం ఏర్పడింది. బోటు ప్రయాణం ఇరకం దీవిని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని సందర్శకులు తెలియజేశారు. ఎమ్మార్వో శరత్ బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్ టూరిజం ఫారెస్ట్, అధికారులు సందర్శకులకు ప్రత్యేక ఏర్పాటు

## సంగనపల్లిలో రోడ్డును బాగు చేయండి సారూ!



దక్కిలి,జనవరి 12 ప్రభాతవార్త: దక్కిలి మండలంలో వ్యవసాయ పొలాలకు వెళ్లేదారి అస్తవ్యవస్తంగా ఉండడం వల్ల రైతులు పలు ఇబ్బందులకు గురువు తున్నట్లు సంగనపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈరోడ్డును నిర్మించారని వారు చెప్పారు. అప్పటి నుంచి ఈరోడ్డును పట్టించుకో కోవడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలియజేశారు. రోడ్డును బాగు చేయకోవడం వల్ల ఈరోడ్డులో రైతులు ధ్యాన్యం తరలించాల్నా...ఎరువులు తీసుకుపోవాలన్నా పలు ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డును బాగు చేయాలని అధికారులు,ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈరోడ్డును బాగు చేయాలి సంగనపల్లి గ్రామ రైతులు కోరుతున్నారు.

## లారీని ఢీ కొన్న మినీ వ్యాన్



నాయుడుపేట, జనవరి 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని పండ్లూరు జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు వద్ద లారీని చేపలలోడు మినీ వ్యాన్ ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విజయవాడ నుంచి అత్తివరం వెళుతున్న లారీ పండ్లూరు జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు వద్ద విశాఖపట్నం నుంచి కేరళకు చేపల లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురై రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాలను పక్కకు తొలిగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

వెంకటగిరి, జనవరి 12 ప్రభాతవార్త: స్థానిక యశోదయ ప్రభుత్వ కళాశాలలో 1978-80వ సంవత్సరం ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. 45 సంవత్సరాల తర్వాత అందరూ ఒకచోట కలిసి పాత జ్ఞాపకాలను స్మరించారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారు అందరూ చర్చించుకున్నారు. విశ్రాంత ఎస్పీ బల్లి రవిచంద్ర, విశ్రాంత ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితర పూర్వక విద్యార్థులు కలుసుకొని ఆనందంగా గడిపారు.

## సమస్యను పరిష్కరించిన విద్యుత్‌శాఖ అధికారులు



వెంకటగిరి, జనవరి 12 ప్రభాతవార్త: పట్టణంలోని 14వ వార్డు నరసింహారావు వీధి అరుంధతివాడ బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ ఎదురుగ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఆ శాఖ అధికారులు ఎత్తు పెంచి సమస్యను తీర్చారు. గతంలో కిందకు ట్రాన్స్ఫార్మర్ ఉన్నందున చిన్నపిల్లలకు సైతం ఇబ్బందులు పడేవారు. దీనివలన గతంలో ప్రమాదాలు కూడా జరిగినవి. నెల క్రితం కరెంటు ఏ.డి. శీనయ్య కి సదరు విషయం గురించి కౌన్సిలరు ఆరి.శంకరయ్య అర్జీ ఇచ్చిన వెంటనే స్పందించి, ఏ.ఈ అశోక్ రెడ్డి, నాగేంద్ర లైమాన్‌ను పంపి ఎస్టిమేషన్ వేసి కరెంటు ట్రాన్స్ఫర్మర్ సమస్యను పరిష్కరించారు. అందుకు గాను విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్టీఆర్ కాలనీలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ప్రారంభం



దక్కిలి,జనవరి12 ప్రభాతవార్తం మండల కేంద్రమైన దక్కిలి ఎన్టీఆర్ కాలనీలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణలో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యంను వెంకటగిరిఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ కృషితో ఏర్పాటు చేశారు. దక్కిలి ఎంపీడీవో రవీంద్ర బాబు సోమవారం ఈపథకంను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వల్ల కాలనీ వాసులకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండడంతో పాటు మంచినీటి సరఫరా కూడా ఇబ్బందులు లేకుండాఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు కిల్లా వెంకటేశ్వర్లు,జగదీష్‌బాబు,టీడీపీ సీనియరు నాయకుడు చంద్రారెడ్డి, నాయకులు సునీల్, పిల్లి శ్రీనివాసులురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విభజనతో గూడూరు విశిష్టత కోల్పోయింది



వాకాడు, జనవరి 12 ప్రభాతవార్త: 16 మండలాలుగా ఉన్న గూడూరు రెవిన్యూ డివిజన్‌ను 3 మండలాలకే పరిమితం చేసి గూడూరు నియోజకవర్గం విశిష్ట కోల్పోయిందని వైకాపా రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ కొడవలూరు దామోదర్‌రెడ్డి బాధ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో రచ్చబండ దగ్గర ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో గూడూరు నియోజకవర్గంలో ఉన్న కోట వాకాడు చిట్టమూరు చిల్లకూరు గూడూరు, గూడూరు రూరల్ మండలాలను గూడూరుగా రెవెన్యూ డివిజన్‌గా ఉంచి, గూడూరు నియోజకవర్గంను తిరుపతి జిల్లాలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కలిపారు. ఆ తర్వాత వచ్చిన టిడిపి పరిపాలనలో గూడూరు నియోజవర్గంను నెల్లూరు కలపాలని జేఏసీ నిరసనలు, ఆందోళనలో చేపట్టడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలో, చిల్లకూరు గూడూరు కోట మండలాలను నెల్లూరు జిల్లాలో కలపడం ఎంతవరకు న్యాయమని ప్రజలు ఆలోచించాలన్నారు.

## కోడిపందాల స్థావరాలపై మెరుపు దాడులు



దొరవారిసత్రం, జనవరి 12 ప్రభాతవార్త: దొరవారి సత్రం మండలం పరిధిలోని సోమవారం నెల్లూరు పల్లి, కొత్తపల్లి గ్రామ శివారులో రహస్య స్థావరాలు నిర్వహిస్తున్న కోడిపందాలపై మండల ఎస్సై కె.అజయ్ కుమార్ దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న నలుగురునీ అదుపులోకి తీసుకొని వారు వద్ద నుంచి 5 మోటర్ సైకిల్లు, 4 కోళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరితో పాటు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ 14ఏళ్ళ నిర్విరామ సేవలు



శ్రీకాళహస్తి,జనవరి 12 ప్రభాతవార్త: 14 సంవత్సరాలుగా నిర్విరామంగా దివ్యాంగులకు సేవలందించటం సాధారణమైన విషయం కాదని నిర్వాహకుడు మునీర్‌బాషా అభినందనీయుడని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డిలు అన్నారు. శ్రీకాళహస్తికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సారధ్యంలో ప్రతి నెల దివ్యాంగులకు అందిస్తున్న సహాయాన్ని సోమవారం అందించే కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు నాయకులు ముఖ్యఅతిథులుగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి తుడా చైర్మెన్ దివాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా దివ్యాంగులకు ప్రతి నెల వారికి అవసరమైన నిత్యావసర సరకులను అందించటం సామాన్యమైన పని కాదన్నారు. అదీ కూడా తమ సొంత సంపాదనలో కొంత అందించటం అనేది ఎంత పొగిడినా తక్కువే అన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్‌కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు, నిదేదిత మోరే, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి,గరిక పాటి రమేష్, బాబాఫరీద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరకులు, దుప్పట్లు,టవల్స్‌ను అందజేసారు.

నిర్మించలతపెట్టిన పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపనలు చేయనున్నారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో పేషెంట్ అటెండెంట్ అమినిటీస్ కాంప్లెక్స్‌ను, ఎస్వీయూలో రూ.7.5 కోట్లతో నిర్మించిన బాలుర వసతి గృహాన్ని, రూ.5 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఎస్వీయూలో పరిశోధన, ఆవిష్కరణలకు చేయూతనిచ్చే విధంగా రూ.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ అడ్వాన్స్డ్ పరిశోధన ల్యాబ్స్, విద్యా, మౌళిక వసతుల కల్పనలో భాగంగా రూ.5.3 కోట్లతో నిర్మించనున్న అకడమిక్ భవనం రెండవ అంతస్థు, రూ.2.91 కోట్లతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. తిరిగి నారావారిపల్లికి చేరుకుంటారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్‌కు విచ్చేసిన పర్యాటకశాఖ మంత్రి



నాయుడుపేట, జనవరి 12 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్‌కు విచ్చేసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని నాయుడుపేట వద్ద సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ సాదరంగా ఆహ్వానం పలికారు. మంత్రితో పాటు జనసేన జిల్లా అధ్యక్షులు హస్తకళ అభివృద్ధి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌ని కూడా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్లా కృష్ణారావు, నాయుడుపేట మండల అధ్యక్షులు గిండి సతీష్, పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన ఎమ్మెల్యే భానుప్రకాశ్



పుత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త : సంక్రాంతి సంబరాలకు చంద్రగిరి మండలంలోని నారావారి పల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నగరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌బాబును కూడా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## నిరసన కార్యక్రమం చేపట్టిన చింతామోహన్




నాయుడుపేట, జనవరి 12 ప్రభాతవార్త: విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఇందుకు బాధ్యులుగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఇప్పటి సీఎం చంద్రబాబు కూడా బాధ్యులేనని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతామోహన్ తీవ్రంగా విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ దుగరాజపట్నం పోర్టును కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలని ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు చేస్తున్న కుయుక్తులను చంద్రబాబు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్య కుటుంబాలకు చెందిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ప్రస్తుత సీఎం చంద్రబాబు కూడా సంపన్నుల జాబితాలో చేరి వారి అభివృద్దిని చేసుకుంటున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్దిని పూర్తిగా విస్మరించారని చింతామోహన్ ఆరోపించారు. ముఖ్యంగా మన్నవరం బెల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అదేవిధంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేసేందుకు చేస్తున్న కుయుక్తులను కాంగ్రెస్‌పార్టీ అడ్డుకుంటుందన్నారు. వీటిపై స్పందించకపోతే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు చందనమూడి శివ, గాడి వెంకటయ్య, చిన్నం కిష్టయ్య, ఎల్లం రాజు, శంకర్‌రాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

## పాకాల మండల సర్వసభ్య సమావేశం




పాకాల, జనవరి 12 ప్రభాతవార్త: పాకాల మండలం స్థానిక ఎంపీడీవో ఆఫీసు నందు సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ లోకనాథం, ఎంపీడీవో ప్రసాద్ రావు, పాకాల సింగల్ విండో చైర్ పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి, తహసిల్దార్ సంతోష్ సాయి. అన్ని డిపార్ట్మెంట్ అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సింగల్ విండో చైర్ పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి మాట్లాడుతూ మన సొసైటీలో రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా యూరియా ఎప్పుడు ఉండేటట్టు మన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అందుబాటులో ఉండేటట్టు చూస్తామని తెలిపారు. ఓవర్ డ్యూలు 40 లక్షలు రైతులు నుండి రెన్యువల్ జరిగాయని తెలిపారు. అచ్చమ అగ్రహారంలో ప్రమాదవశాత్తు ఊరికి వచ్చే నీళ్ల బావిలో పడిపోయి చనిపోవడం జరిగిందని, ఊర్లో వాళ్లకు నీళ్లకి ఇబ్బందిగా ఉంటే మన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ వెంటనే స్పందించి గ్రామస్తులు, సర్పంచి, సింగల్ విండో చైర్మెన్ అందరు కలిసి రెండు రోజుల్లో కొత్తగా మోటారు పైపులు అన్ని బిగించి ట్రాన్స్ఫార్మర్ పెట్టడం జరిగిందన్నారు. అలానే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వాళ్లు రాలేదు కాబట్టి రైతులు కొంతమంది సొంత పొలాల్లో చెట్లు తీసి కోసుకొని వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని మా దృష్టికి వచ్చిందని రెవెన్యూ తాసిల్దార్ అన్నారు. గాండ్లపల్లెలో చింతచెట్టు పడిపోయింది, దానిని సందర్శించి ఈ చింతచెట్టు పట్టా భూముల్లో ఉందని వాళ్ళని తీసుకోమ్మని లెటర్ ఇచ్చినప్పటికీ కూడా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వాళ్ళు నిలిపేసి కొంచెం ఇబ్బందులు పెట్టారన్నారు. కాబట్టి వాళ్లకు కూడా మా రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు.

## సిఎంను కలిసిన విజయ్‌బాబు



పుత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త : సంక్రాంతి సంబరాలకు చంద్రగిరి మండలంలోని నారావారి పల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌బాబును కూడా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త: ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మిమిక్రీ శివారెడ్డి, గాయని లిప్సిక, గాయకులు శ్రీకృష్ణ, అతిథి భవరాజు, పాటలు ఉర్రూతలూగించాయి. కీబోర్డు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటకచ్చేరి ఆకట్టుకుంది. ఎస్‌డిసి డాన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సినీ డాన్స్‌లు ప్రేక్షకులను అలరించాయి.

## ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త: స్వామి వివేకానంద 162 జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి, అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్రం స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అయితా మురళీకృష్ణ గారి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ప్రముఖులు అందరు పాల్గొని శ్రీకాళహస్తి బాలుర కళాశాల నందు ఉన్నటువంటి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆర్యవైశ్య ప్రముఖులు కోటిలింగాల శశిధర్ కుమార్ గుప్తా, మెంటా సుబ్బారావు, పెసల వెంకటరత్నం, కుందా మోహన్, గోనుగుంట పెంచల శ్రీనివాసులు, గునుపూటి గురవయ్య శెట్టి, చీదెళ్ల లోకేశ్వరరావు, మస్తాన్ పాల్గొన్నారు.

**మండల పరిషత్ కార్యాలయంలో...**

స్వామి వివేకానంద జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తిలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వివేకానంద ఉద్యాన వనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లాశాఖ సామాజిక వేదిక వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆపస్ జిల్లా అధ్యక్షులు తూకివాకం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మునేంద్ర బాబు జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ యాదవ్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు చలం ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యంరెడ్డి శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు పి.రవి,ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం సమసతావేదిక నాయకులు పాల్గొన్నారు.

**స్కాట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో:**

శ్రీకాళహస్తిలో స్వామి వివేకానంద జయంతిని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ మాస్టర్ ఎస్ కె. అజారుద్దీన్ మాట్లాడుతూ వివేకానంద ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని నడుచు కోవాలని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కాట్ మాస్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ధనుష్, ఏపీజే అబ్దుల్ కలాం స్కాట్ ట్రూప్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, జనవరి 12 ప్రభాతవార్త: సీఎం నారా చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్యే కురుమండ్ల రామకృష్ణ నారావారిపల్లెలో కలిశారు. సీఎం చంద్రబాబు నాయుడుకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణను నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్యే కోరారు.

## తల్లిప్రేమ.. కూతురు పండగకి ఇంట్లో ఉండట్లేదని

**- ఒంటిపై పెట్రోల్ పోసుకుని తల్లి ఆత్మహత్యాయత్నం !!**

కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త: చాలాకాలం తర్వాత పుట్టింటికి వచ్చిన కుమార్తె పండగకు ముందు తాను తన భర్త ఇంటికి వెళ్తాననడంతో ఆమె తల్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన ఇది. కుప్పం అర్బన్ ఎస్సై బాబు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని గరిగచీనేపల్లి గ్రామంలో పాండుర ఒగన్ భార్య విమల (43) నివాసం ఉంటోందన్నారు. ఈమె కుమార్తె గతనాలుగేళ్ల క్రిత ం ప్రేమ వివాహం చేసుకునివెళ్లిపోయిందన్నారు. అయితే ఇటీవల విమల కుమార్తె తన పుట్టింటికి వచ్చింది. సోమవారం తాను మరలా తిరుగుప్రయాణంఅవుతానని తనకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తల్లికి చెప్పిందన్నారు. అయితే విమల తన కుమార్తెను సంక్రాంతి ప ండగ చూసుకుని వెళ్లవచ్చని సూచించిందన్నారు. అయితే ఆమె కుమార్తె అంగీకరించకపోగా విమల ఒక్కసారిగా పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుందన్నారు. దీంతో కాలిన గాయాలపాలైన విమలను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాబు తెలిపారు.

## సువాసిని పూజకు ప్రపంచ రికార్డు

రామచంద్రాపురం,జనవరి 12ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం రాయలచెరువు సమీపాన వెలసిన శ్రీశక్తిపీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సువాసినీ పూజకు ప్రపంచ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సహా ప్రపంచ రికార్డులు లభించాయని పీఠాధిపతి రమ్యానందభారతి తెలిపారు. పీఠంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 6వతేదీ తిరుపతి ఎన్టీఆర్‌స్టేడియంలో పదివేలమంది మహిళలతో ఒకేసారి ఒకేచోట నిర్వహించిన సువాసిని పూజలో దీపాలు వెలిగించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. పూజలో పాల్గొన్న ప్రతి మహిళకు ఉచితంగా పూజాసామాగ్రితో బాటు పసుపు,కుంకుమ, చీర,సారె ఆడబిడ్డలాంచనాలు అందించామన్నారు. ఆరోజు సువాసిని పూజా ప్రాంగణం మహిళలతో మణిద్వీపంలా వెలుగొందిందని, ఈ అరుదైన గౌరవం పీఠానికి, వ్యక్తిగతంగా తనకే గాకుండా యావత్ మహిళా లోకానికి దక్కిన అపూర్వగౌరవమని రమ్యానందభారతి తెలిపారు.

## నేడు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు



చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మంగళవారం పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి సంబరాలను సొంతూరు జరుపుకునేందుకు సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో సహా నారావారిపల్లికి చేరుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు టిటిడి కళ్యాణ మండపంలో సంక్రాంతి సంబరాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం శేషాపురం వద్ద భీమవరం-రంగంపేట రోడ్డు నుండి టిటిడి అనుబంధ శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయానికి రూ.70 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారు. ఆపై నారావారిపల్లిలో నూతనంగా నిర్మించిన 33/11 కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని, సంజీవని ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అదేవిధంగా మూలపల్లి వద్ద నీవా బ్రాంచి కెనాల్ నుండి కళ్యాణీ డ్యామ్‌కు, మూలపల్లి చెరువుతో పాటు మరో నాలుగు చెరువులకు నీటిని తరలించే రూ.126 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుకు, రూ.10 లక్షలతో

## నోటీసులు ఇచ్చినా మారని రెవెన్యూ తీరు

**- వరదయ్యపాలెం రెవెన్యూ కార్యాలయంలో అనధికార కంప్యూటర్ ఆపరేటర్లు**



వరదయ్యపాలెం, జనవరి 12 ప్రభాతవార్త: మూడేళ్ల కిందట ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేసి తహశీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అనధికారికంగా కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకుని రెవెన్యూ కార్యకలాపాలు నిర్వహించడంపై అభియోగాలు నమోదు చేశారు. దీనిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి వివరణ కోరుతూ సంబంధిత శాఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. అయినా రెవెన్యూ అధికారులు తీరు మారలేదు. కార్యాలయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అనధికారికంగా కంప్యూటర్ ఆపరేటర్‌లు విధులు చేపట్టడంపై అనేక విమర్శలు, అనుమానాలు వ్యక్తం అవుతోంది. వివిధ ధృవీకరణ పత్రాలు మంజూరు వంటి ప్రజాపయోగ పనుల కోసం ప్రభుత్వ ఆపరేటర్ ఉండగా, మరొకరు ప్రభుత్వ అనుమతితో మరో కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు. అయితే ఏడాదిగా ఇద్దరు అనధికారికంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఉండటంపై ఆరోపణలు వ్యక్తం అవుతోంది. గత అనుభవం దృష్ట్యా పలు రెవెన్యూ రికార్డులు, భూ వివాదాలతో అవకతవకలు అక్రమాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహశీల్దార్ సుధీర్ రెడ్డి వివరణ కోరగా రెవెన్యూ కార్యకలాపాల కోసం కంప్యూటర్ ఆపరేటర్ నియామకంకై అనుమతి కోరుతూ జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామని అన్నారు.